
ప్రజాశక్తి

శనివారం 14 సెప్టెంబర్ 2024





పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి-గుడ్లూరు

గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్నారులు నిరంతరం పౌష్టికాహారం తీసుకోవడంతో రోగ నిరోధక శక్తి పెరగడమే కాక ఆరోగ్యంగా ఉంటారని ఐసిడిఎస్ ఉలవపాడు ప్రాజెక్టు అధికారిణి అరుణ అన్నారు. మండలంలోని ఏలూరుపాడు లో జరిగిన పౌష్టకాహార మాసోత్సవాలు సందర్భంగా ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం విశిష్టతపై అవగాహన కల్పించాలని కార్యకర్తలని ఆదేశించారు. కేంద్రాలు పరిశుభ్రంగా ఉండాలని, చిన్నారులకి తప్పనిసరిగా పాలు, గుడ్లు ,చిక్కీలు తినిపించాలని గర్భిణులు, బాలింతలు, ఆకుకూరలు మొలకెత్తిన గింజలు, తీసుకోవాలని కోరారు.గుడ్లూరు మండలం తెట్టు సెక్టార్ సూపర్వైజర్ కామేశ్వరి ,అంగన్వాడీ కార్యకర్తలు తిరుపతమ్మ, మాలకొండమ్మ ,ప్రసన్న, ఆయాలు చిన్నారులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికారిణి అరుణ

టిడిపిని ముంచేస్తోన్న వైసిపి..!

"వైసిపిని ముంచేస్తోన్న టిడిపి" ఇది అందరూ చెప్పే మాటే... అయితే పరిస్థితి అలా కనిపించడ లేదు. "టిడిపిని ముంచేస్తోన్న వైసిపి" అనేలా ఉంది ప్రస్తుత పరిస్థితి. ఎన్ని కలకు ముందు టిడిపి నేతల మంటూ చెప్పుకొని తిరిగిన నేతలు ఇప్పుడు ముఖం చాటేస్తున్నారు. వైసిపి తరపున పోటీ చేసి గెలిచిన కార్పొరేటర్లు, ఆపార్టీకి పనిచేసిన ముఖ్యనేతలంతా ఇప్పుడు టిడిపిలో జంప్ అవుతున్నారు. ఐదేళ్లు రాజకీయ కక్షలు, ఇబ్బందులు తట్టుకోలేక టిడిపిలో సర్దుకుంటున్నారు. నెల్లూరు నగరంలోని 54 మంది గత ఎన్నికల్లో వైసిపి ఖాతాలోకి చేరాయి. నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ చరిత్రలో ఇది రికార్డు. ఇప్పుడు నలుగురు , ఐదుగురు తప్ప అందరూ టిడిపిలో జంప్ అవుతున్నారు. ఇప్పటికే సీనియర్ నేతలు వచ్చేశారు. వారితోపాటు ద్వితీయ శ్రేణి నేతలు టిడిపిలో చేరిపోయారు. ఇప్పుడు ఉన్న కొద్ది మంది నేతలు టిడిపిలో చేరేందుకు సిద్ధమవుతున్నారు. పాత తరం టిడిపి నేతలు గగ్గోలు పెడుతున్నారు. టిడిపిని వైసిపి నేతలు ముంచేస్తున్నట్లు కనిపిస్తోంది. ఎవరిని ఎవరు దెబ్బతీస్తున్నారో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి..



ముక్కాల ద్వారకానాథ్ (ఫైల్)

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

రాజకీయాల్లో ఎప్పుడు ఏమైనా జరిగిపోతుంది. 2019 ఎన్నికల్లో ప్రభంజనం సృష్టించిన వైసిపి ఇప్పుడు గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటుంది. ఆ సమయంలో ఇదరు ఎంపిలు, 10 మంది ఎంఎల్ఎలు, జెడ్‌పి చైర్మన్, మేయర్, ఎంఎల్‌సిలు దాదాపు 98 శాతం ప్రజా ప్రతినిధులు ఆపార్టీ వారే. ఇంత క్లిష్టమైన పరిస్థితుల్లో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, బీద రవిచంద్ర వంటి నేతలు ఆపార్టీని కాపాడు కున్నారు. ఉన్న నేతలను కాపాడు కుంటూ, పార్టీ అధికారంలోకి వస్తే మంచి భవిష్యత్తు వస్తుందని, ధైర్యం చెబుతూ వచ్చారు. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 54 డివిజన్లకు టిడిపి అభ్యర్థులను పోటీ పెట్టింది. ఎక్కడా వైసిపి ఢీకొనే స్థితి లేదు. ఆర్థికంగానూ వైసిపికి ఒక్క నేత పోటీ పడలేక పోయారు. కార్పొరేషన్ చరిత్రలో 54 డివిజన్‌లలో 54మంది వైసిపి అభ్యర్థులు గెలిచారు. అప్పట్లో వైసిపి తిరుగులేని శక్తిగా జిల్లాలో ఉంది. టిడిపి సీనియర్ నేతలు ఆపార్టీకి కాపాడుకుంటూ వచ్చారు. 2024 ఎన్నికల్లో గెలవడానికి అనేక ఉద్యమాలు చేశారు. కొందరు కేసులు ఎదుర్కొన్నారు. పార్టీ అధికారంలోకి వస్తుందనే భరోసాతో పనిచేశారు. ఎన్నికలకు ముందు రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఎంఎల్ఎలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిలు టిడిపిలోకి వచ్చారు. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావ్య కృష్ణారెడ్డి, వంటి అనేక మంది నేతలు వచ్చారు. వారితోపాటు వైసిపిలో ఉన్న నేతలు వచ్చారు. అప్పటికే ఉన్న టిడిపి నేతలు గగ్గోలు పెట్టారు. అధికారం వచ్చే సమయానికి వైసిపి నేతలు మా పార్టీలోకి వస్తున్నా మా పరిస్థితి ఏమనే ప్రశ్న అప్పుడే వచ్చింది. ఇది ఒకప్పటి మాట. ఇప్పుడు టిడిపి అధికారంలోకి రావడంతో వైసిపి నేతలు కట్టకట్టుకొని టిడిపిలోకి వస్తున్నారు. పార్టీ ఏర్పాటు నుంచి ఉన్న నేతలు గగ్గోలు పెడుతున్నారు. ఇతర పార్టీ నుంచి వచ్చేవారిని చేర్చు కోమని టిడిపి అధినేత చంద్రబాబునాయుడు తొలుత ప్రకటించారు. ఇప్పుడు పార్టీలోకి అందరూ రావడానికి తలుపులు తెరుస్తున్నారు. ఎన్నికల ముందే పరిస్థితి అలా ఉంటే ఇప్పుడు అధికారపార్టీ కావడంతో వైసిపి నేతలు పెద్ద ఎత్తున టిడిపిలో చేరుతున్నారు. నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని 54 మందిలో నలుగురు కార్పొరేటర్లు తప్ప మిగిలిన 50 మంది టిడిపిలో చేరుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కోటంరెడ్డి సోదరుల నేతృత్వంలో ఆ నియోజకవర్గ కార్పొరేటర్లు టిడిపిలో చేరారు. నేడో, రేపో నారాయణ ఆధ్వర్యంలో నెల్లూరు నగర పరిధిలోని కార్పొరేటర్లు చేరడానికి సిద్ధమయ్యారు. గత కార్పొరేషన్ ఎన్నికల్లో వైసిపి కార్పొరేటర్లతో పోటీ పడి ఓడిపోయిన టిడిపి నేతలు ఇప్పుడు తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. టిడిపి అంతా వైసిపి నేతలతో నిండిపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలు వైసిపిని టిడిపి ముంచేస్తోందా ? టిడిపిని వైసిపి నేతలు ముంచేస్తున్నారా ? అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిణామాలు సీనియర్ టిడిపి నేతలకు మింగుడు పడడం లేదు. త్వరలో రానున్న , నామినేటెడ్ పదవులు విషయంలోనైనా న్యాయం జరుగుతుందా లేదా అను మానమే అంటున్నారు. జనసేన, బిజెపి నేతలు తమ వాట తమకు కావాలంటూ పట్టుపడుతున్నారు. అధికారం వచ్చిన తరువాత టిడిపి నేతల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఎవరిని కదిలించినా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- కార్పొరేటర్లు టిడిపిలోకి జంప్
- వైసిపి నేతలది అదే బాట
- పాతతరం టిడిపి నేతలు లబోదిబో

టిడిపి వైపు 'ముక్కాల' చూపు..!

వైసిపి నాయకులు, నుడా చైర్మన్, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకులు ముక్కాల ద్వారకానాథ్ టిడిపి వైపు చూస్తున్నట్లు సమాచారం. ఆర్యవైశ్యుల్లో ఇటీవల కాలంలో రాష్ట్ర స్థాయిలో ముక్కాల మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. గతంలో ప్రజారాజ్యంలో పనిచేసినా పెద్దగా గుర్తింపు రాలేదు. వైసిపిలో చేరిన తరువాత జగన్‌మోహన్‌రెడ్డి ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఇచ్చారు. నుడా ఛైర్మన్ కట్టబెట్టారు. టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత ఆర్యవైశ్యుల్లోకి కొందరు వ్యక్తులు, ముక్కాల మధ్య వివాదం జరిగింది. ఇలాంటి సమయంలో వైసిపిలో కొనసాగడం కంటే టిడిపితో నడవడమే మంచిదనే అభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. పార్టీలో చేరేందకు సన్నాహాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఏం జరుగుతుందో చూడాలి.

17న నులిపురుగుల నివారణ దినోత్సవం

ప్రజాశక్తి-కందుకూరు: మండలంలోని మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పి హెచ్ సి వైద్యాధికారిణి డాక్టర్ ఎస్‌డి జువేరియా భాను ఆధ్వర్యంలో సెప్టెంబరు 17వ తేదీన జరగబోవు జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం గురించి సిబ్బందికి సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జువేరా భాను మాట్లాడుతూ మండలంలోని ప్రతి సచివాలయ పరిధిలో గల సంవత్సరం నుండి 19 సంవత్సరంలోపు పిల్లలందరికీ ఆల్బెండజోల్ 400ఎంజి నులిపురుగుల మాత్రలు తప్పనిసరిగా వేయాలన్నారు. . కార్యక్రమంలో పి హెచ్ ఎన్ బి వరలక్ష్మి , హెల్త్ సూపర్‌వైజర్లు ఎం. శ్రీనివాసరావు, ఎన్ వి. సుశీల, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశుధ్యపనులు పరిశీలన

ప్రజాశక్తి-కందుకూరు: కందుకూరు మున్సిపల్ కమిషనర్ కె అనూష,శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమణా రెడ్డి సూచనల మేరకు శుక్రవారం పారిశుధ్య సిబ్బంది ద్వారా ఏకలవ్య నగర్, పడమట వడ్డె పాలెం, బండ పాలెం, ఆదిఆంధ్ర కాలనీలలో మురుగు కాలవలను శుభ్రం చేయించారు. అనంతరం ట్రాక్టర్ ద్వారా చెత్తను తీయించి దోమల లార్వా నిర్మూలన మందునుస్ప్రే చేయించారు.



జగనన్న గృహాలపై విజిలెన్స్ తనిఖీ

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు: జగనన్న గృహాలపై విజిలెన్స్ శాఖ ప్రత్యేక దృష్టి పెట్టింది. ఈ మేరకు మండలంలోని వరిగొండలో ఏర్పాటు చేసిన మూడు లే అవుట్లను విజిలెన్స్ డి ఇ మహిత (విజయవాడ), ఏఈ అవినాష్ రెడ్డి, తదితరులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జగనన్న లేఅవుట్లలో ఎన్ని ప్లాట్లు కేటాయించారు, ఎన్ని ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు, బేస్ మెంట్ లెవల్, లెంటిల్ లెవల్, రూఫ్ లెవల్ తదితర అంశాలపై వాకబు చేశారు. ఫౌండేషన్ నాణ్యత లను పరిశీలించారు. మూడు లే అవుట్లలో మొత్తం 300 పైగా ఇళ్ల స్థలాలు ఉన్నాయని, వాటిలో 200ల చిల్లర ప్లాట్లు ఖాళీగా ఉన్నట్లు స్థానిక టీడీపీ సీనియర్ నాయకులు కోడూరు శ్రీనివాసులు రెడ్డి (చినబాబి రెడ్డి) తెలిపారు. నిర్మాణాలు నాసిరకంగా ఉన్నాయని, వాటిని తొలగించి తిరిగి నిర్మాణాలు చేపట్టాల్సి ఉందని విజిలెన్స్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కర్పూరపు శ్రీనివాసులు రెడ్డి, హౌసింగ్ ఏఈ అక్మల్, లబ్దిదారులు, తదితరులు పాల్గొన్నారు.

పోరాటయోధుడు 'ఏచూరి'కి ఘన నివాళి

-ప్రగాఢ సంతాపం తెలిపిన సిపిఎం జిల్లా కమిటీ

ప్రజాశక్తి-నెల్లూరు

దేశ రాజకీయ చిత్రపటంలో తనదైన శైలిలో ముద్ర వేసుకున్న కమ్యునిస్టు యోధుడు, సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతికి సిపిఎం జిల్లా శాఖ ఘన నివాళి అర్పించింది. శుక్రవారం నగరంలోని డాక్టరు రామచంద్రారెడ్డి భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించింది. సిపిఎం జిల్లా కార్యాలయంలో నాయకులు టి.గోపాల్ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ అభ్యుదయ భావాలు కలిగిన ఓ పోరాట యోధుడిని కోల్పోయిందన్నారు. రాజ్యసభ సభ్యుడిగా ప్రజాసమస్యలపై చర్చలు నిర్వహించి పరిష్కారానికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి గొంతుక మూగబోయిందన్నారు. దేశంలోని పరిస్థితులకు అనుగుణంగా ఉద్యమాలను నిర్మించడంలో ఆయన కీలక భూమికను పోషించారన్నారు. అటువంటి వ్యక్తి భౌతికంగా మన మధ్య లేకపోయినప్పటికీ ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలుగు గడ్డపై జన్మించినప్పటికీ అత్యున్నతమైన స్థాయికి చేరుకోని వామపక్ష పార్టీకి అనుబంధమైన విద్యార్థి సంఘంలో చురుకైన పాత్ర పోషిస్తూ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు నడిపారన్నారు. దేశ రాజకీయాల్లోనే ఆజాతశత్రువుగా నిలిచారన్నారు. అటువంటి వ్యక్తి మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటన్నారు. సీతారాం ఏచూరికి జిల్లాకు ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా నాయకులు గుర్తు చేశారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు చంద్ర రాజగోపాల్, మాజీ ఎంఎల్‌సి విటపు బాలసుబ్రహ్మణ్యం, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, ఎం.మోహన్‌రావు, గోగుల శ్రీనివాసులు, కె.అజయ్‌కుమార్, ఉపాధ్యాయ సంఘం నాయకులు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

ముత్తుకూరు పోలీస్ తీరు బాధాకరం

ప్రజాశక్తి-నెల్లూరు : వెంకటాచలం మండలం, గుడ్లూరు వారి పాలెంకు చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు మేరకు ముత్తుకూరు మండలం ముత్తుకూరు దళితవాడ ఎస్సీ కులానికి చెందిన ఆరుగురు యువకులను ముత్తుకూరు ఎస్ఐ విశ్వనాథ రెడ్డి కానిస్టేబుల్ సుమన్ సంబంధం లేని కేసులో పిలిపించి విచారణ పేరుతో విచక్షణ రహితంగా కొట్టి వెంకటాచలం పోలీసులకు అప్పగించిన తీరుపై మాజీ జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు శేషం.సుదర్శన్ మండిపడ్డారు. శుక్రవారం ఈ మేరకు పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. విచారణ పేరుతో దళిత యువకులను పోలీస్ స్టేషన్ కి పిలిపించి సంబంధం లేని కేసులో మానవ హక్కుల ఉల్లంఘించి నిజా నిజాలు తెలుసుకోకుండా విచక్షణ రహితంగా కొట్టడం దారుణమ న్నారు. సదరు విషయాన్ని పరిగణలోకి తీసుకొని దళిత యువకుల పట్ల పోలీస్ సిబ్బంది ప్రవర్తించిన తీరుపై విచారణ జరిపాలని, బాధితులకు వారి కుటుంబాలకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

విఎస్‌యులో సెమీకాన్ ఇండియా 2024

ప్రజాశక్తి-వెంకటాచలం:

భారతదేశంలోని సెమీకండక్టర్ రంగాన్ని కొత్త దశలోకి తీసుకెళ్లే సెమీకాన్ ఇండియా 2024 ప్రారంభోత్సవం, గ్రేటర్ నోయిడా, ఢిల్లీ ఎన్‌సిఆర్‌లో ఘనంగా జరిగింది. ఈ ప్రారంభోత్సవంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాల్గొని సెమీకండక్టర్ రంగంలో భారతదేశం గణనీయమైన పురోగతిని సాధించడంపై అభినందనలు తెలిపారు. దేశానికి సమర్థవంతమైన సెమీకండక్టర్ మాన్యుఫ్యాక్చరింగ్, డిజైన్ సామర్థ్యాలను సాధించడానికి, పెట్టుబడులు ఆకర్షించడంలో ప్రభుత్వ ప్రాధాన్యతను వివరించారు.పరిశ్రమ నిపుణులు, ప్రముఖ అంతర్జాతీయ కంపెనీల ప్రతినిధులు, సాంకేతిక నిపుణులు హాజరయ్యారు. సెమీకాన్ ఇండియా భారతదేశం నుంచి సెమీకండక్టర్ తయారీ, పరిశోధన, ఆవిష్కరణలను ప్రోత్సహించడం ద్వారా గ్లోబల్ మార్కెట్‌లో తన స్థాయిని మరింత పెంచుకోనున్నట్లు విశ్వసిస్తున్నారు.ఈ కార్యక్రమాన్ని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని సర్ సి.వి. రామన్ సెమినార్ హాల్‌లో ప్రత్యక్ష ప్రసారంలో విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఎస్.విజయ భాస్కర రావు, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీతలు తిలకించారు.



మాట్లాడుతున్నఎస్.విజయ భాస్కర రావు

చెరువులోని ఆక్రమణలను తొలగించాలి

ప్రజాశక్తి-వలేటివారిపాలెం

రామన్న చెరువులోని ఆక్రమణలను కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ శుక్రవారం పరిశీలించారు. చెరువుకు చుట్టుపక్కల భూములు కలిగిన రైతులు చెరువు లోతట్టు ప్రాంతాన్ని ఆక్రమించి చదును చేసి విద్యుత్ మోటర్లు వేసి పంటలు సాగు చేస్తున్నట్లు ఆమె దృష్టికి రావడంతో పరిశీలించారు. సాగుచేసిన పంటలను చదును చేసిన భూములను పరిశీలించి వెంటనే చెరువులోని ఆక్రమణ తొలగించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. హద్దులు ఏర్పాటు చేసి ఆక్రమణలు తొలగించాలని సూచించారు. అంతేకాకుండా చెరువులో ఇటుక బట్టి యజమానులు మట్టి తోలిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెరువులోని లోతట్టు ప్రాంతాన్ని ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. చెరువులో చిల్లకర్రను అక్రమంగా తరలించిన చెరువులోని మట్టిని అనుమతులు లేకుండా తరలించకపోయిన చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు. ఆమె వెంట మండల సర్వేయరు వెంకటేశ్వర్లు, వీఆర్వో నరేంద్ర తదితరులున్నారు.

భవిష్యత్తు యువతరానిదే..

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

భవిష్యత్తు యువతరానిదేనని, 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత దేశాన్ని ప్రస్తుత యువత చూడబోతోందని జిల్లా విద్యాశాఖ అధికారి పివిజె రామారావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మండలంలోపి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల (దర్గామిట్ట)లో నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాసరచన వక్తృత్వ పోటీల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజయ్యారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ 2047 నాటికి భారత దేశం అభివృద్ధి చెందిన దేశంగా మారాలి అంటే దేశంలోని మానవ వనరులు విజ్ఞాన దాయకమైన ఉన్నతమైన మానవనరులుగా మారాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు చదువు ఒకటే మార్గమని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కృష్ణారెడ్డి, జిల్లా సైన్స్ అధికారి డి కరుణాకర్ రెడ్డి, న్యాయ నిర్ణేతలుగా జిల్లా ఎన్జీసీ కోఆర్డినేటర్ కె.భక్తవత్సల బాబు నాయుడు, సిహెచ్‌వి ఫణి కుమార్, ఎం.హరిబాబు, విజయ ప్రసూన, కె.నాగరాజుతో పాటు వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థినీ, వి ద్యార్థులు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రం అందజేస్తున్న దృశ్యం

పోషక ఆహార విలువలపై అవగాహన


ప్రజాశక్తి-కందుకూరు: కందుకూరు కృషి విజ్ఞాన కేంద్రం గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ బి. నీహారిక మండల కేంద్రీయ విద్యాలయం,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సంపూర్ణ అభివృద్ధి కోసం సమతుల్య ఆహారం, తాజా పండ్లు , కూరగాయలు తినడం ప్రాముఖ్యత, వాటి పోషక విలువలు గురించి శుక్రవారం అవగాహన కలిగించారు. పాఠశాల పరిసరాల్లో ప్రతిరోజూ క్రమం తప్పకుండా పండ్లు ,కూరగాయలు తప్పనిసరిగా తినడం కోసం పౌష్టికాహార పెరటి తోటల పెంపకంపై ఐదు రోజులుగా ప్రథమ శ్రేణి ప్రదర్శనలు ఇచ్చారు. పోషకాహార లోపాలు నివారించుటకు రోజు వారి ఆహారంలో కనీసం 400 గ్రా కూరగాయలు, 100 గ్రా పండ్లు తీసుకోవడం తప్పనిసరి అని తెలియజేశారు. విద్యార్థులకు ఆహార, పోషకాహార భద్రతను బలోపేతం చేసే మెలకువలు తెలియజేశారు. పౌష్టికాహార పెరటి తోటల వలన స్థానికంగా పండించే తాజా పండ్లు, కూరగాయలు ఎల్లపుడూ అందుబాటులో ఉంటాయన్నారు. ఇవి ఆహార వైవిధ్యాన్ని పెంపొందించడానికి, అత్యవసరమైన సూక్ష్మపోషకాలు మనకు ప్రతిరోజూ అందచేయడంలో సహాయపడతాయన్నారు. పోషకాహార లోపం, ఆరోగ్య రుగ్మతలు అన్నీ వయసుల వారిలో నివారించడానికి ఇవి తోడ్పడతాయన్నారు. పాఠశాల పరిసరాల్లో పెరటి తోటల పెంపకం ద్వార పిల్లలకు పౌష్టికాహార మధ్యాహ్న భోజనం అందించవచ్చున్నారు. పిల్లలలో పర్యావరణ సంరక్షణకు మొక్కల పెంపకంపై ఆసక్తి కలుగుతుందన్నారు. పిల్లల మానసిక ఆరోగ్యం కోసం ఆటలతో పాటు పెరటి తోటల పెంపకం సాయపడుతున్నారు. కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న దృశ్యం

ఎంఎల్ఏ ఇంటూరిపై వరద బాధితుల ప్రశంసలు


ప్రజాశక్తి-కందుకూరు:విజయవాడ రూరల్ మండలం, జక్కంపూడి కాలనీలో ఐదు రోజులుగా వరద సహాయక చర్యల్లో పాల్గొంటున్న కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు అక్కడ సాధారణ పరిస్థితులు ఏర్పడేంతవరకు రాత్రింబవళ్లు శ్రమించిన తీరు పట్ల వరద బాధితుల నుంచి ప్రశంసలు అందుకున్నారు. ముఖ్యంగా ప్రతి బాధితుడికి నిత్యావసర వస్తువులు అందేలా చూడడం, ఇళ్లల్లో బురద క్లీనింగ్, రోడ్లు కాలువలపై శానిటేషన్ కార్యక్రమాలను ఎమ్మెల్యే దగ్గరుండి పర్యవేక్షించారు. మురుగునీరు, బురద పూర్తిగా తొలగిపోయేంతవరకు అక్కడే ఉండి, బాధితులకు అన్ని విధాలా తోడుగా నిలబడ్డారు. ప్రధానంగా అక్కడ ఉన్న పరిస్థితుల దృష్ట్యా ప్రజలు రోగాల బారిన పడకుండా ప్రతి ఇంటికీ మందులతో కూడిన కిట్లు, సురక్షిత తాగునీరు అందించేలా చర్యలు తీసుకున్నారు. ప్రతి ఇంటికీ జరిగిన నష్టాన్ని అంచనా వేస్తున్న అధికారులతో కలిసి, క్షేత్రస్థాయిలో తిరుగుతూ బాధితులకు న్యాయం జరిగేలా చొరవ తీసుకున్నారు. అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, వాలంటీర్లను సమన్వయం చేసుకుంటూ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తనకు అప్పగించిన పనులను సమర్థవంతంగా పనిచేసి ప్రభుత్వ పెద్దల నుంచి ప్రశంసలు పొందారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ తదితరులు బాగా పనిచేశారు అంటూ నాగేశ్వరరావును మెచ్చుకున్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్ఏ ఇంటూరి

చల్లా,కంద్రా కుటుంబాలకు మాజీ ఎంఎల్ఏ పరామర్శ

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు పట్టణం తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షులు కంద్రా మాల్యాద్రి తండ్రి కంద్రా సోమయ్య గురువారం సాయంత్రం మృతిచెందిన విషయం తెలుసుకున్న కందుకూరు మాజీ శాసనసభ్యులు పోతుల రామారావు చుట్టుగుంట గ్రామంలోని వారి నివాసంలో వారి కుటుంబ సభ్యులను కలిసి సానుభూతి తెలియజేశారు. పోతుల వెంట దివి మాధవరావు, కంద్రా హరిబాబు, బెజవాడ ప్రసాద్ కంద్రా మాలకొండయ్య, నల్లూరి వీర రాఘవలు,కంద్రా యువరత్న చౌదరి తదితరులు ఉన్నారు.తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు,ఒంగోలు డెయిరీ మాజీ చైర్మన్ చల్లా శ్రీనివాసరావు తల్లి చల్లా లక్ష్మమ్మ గురువారం మృతిచెందింది.కందుకూరు మాజీ శాసనసభ్యులు పోతుల రామారావు కందుకూరు మండలం ఓగురు గ్రామంలోని వారి నివాసంలో వారి కుటుంబ సభ్యులను కలిసి సానుభూతి తెలియజేశారు.



వాడవాడలా సీతారాం ఏచూరికి నివాళులు



29డివిజన్‌లో



25డివిజన్‌లో



ఆత్మకూరు బస్టాండ్‌లో



జెవివి ఆధ్వర్యంలో



జెఎస్ ట్రస్టులో



టిపి గూడూరులో



మనుబోలులో



గుడ్లూరులో



కందుకూరులో



డైకస్‌రోడ్డులో

ప్రజాశక్తి –నెల్లూరు

సిపిఎం ప్రధాన కార్యదర్శి, మాజీ రాజ్యసభ సభ్యులు ఏచూరి సీతారామారావు మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని మాజీ జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు శేషం సుదర్శన్ ఒక ప్రకటనలో తెలియజేశారు ఏచూరి సీతారామారావు విద్యార్థి దశ నుంచి రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించారన్నారు.

డైకాస్‌రోడ్డు సెంటర్‌లో

స్థానిక డైకాస్ సెంటర్లో సెంటర్ సిపిఎం కార్యాలయంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళి ర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రూరల్ కార్యదర్శి బత్తల కృష్ణయ్య, రూరల్ కార్యదర్శి వర్గ సభ్యులు కొండా ప్రసాద్ ,రూరల్ కమిటీ సభ్యులు ఎస్‌కె ఖలీల్, సిఐటియు, డివైఎఫ్ఐ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆత్మకూరు బస్టాండ్ సెంటర్‌లో

నగరంలోని ఆత్మకూరు ఆర్‌టిసి బస్టాండ్ సెంటర్‌లో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు సీతారాం ఏచూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు నగర కార్యదర్శి జి.నాగేశ్వర రావు మాట్లాడారు.కార్యక్రమంలో ఆటో కార్మికులందరూ పాల్గొన్నారు. ఆటోయూనియన్ నగర కార్యదర్శి మురళి, తదితరులు పాల్గొన్నారు.

మహాత్మా గాంధీ నగర్ సెంటర్‌లో

సీతారాం ఏచూరి మృతికి సంతాపంగా 29వ డివిజన్ మహాత్మా గాంధీ నగర్ సిపిఎం ఆఫీస్ వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. తొలుత సిపిఎం సీనియర్ నాయకులు మహ్మద్ సబాయి సీతారాం ఏచూరి చిత్రపటానికి మాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, సిపిఎం రూరల్ కార్యదర్శి బత్తల కృష్ణయ్యలు మాట్లాడారు.కార్యక్రమంలో సిపిఎం రూరల్ కమిటీ సభ్యులు సయ్యద్ రఫీ అహ్మద్, షేక్ అహ్మద్, వెంకటేశ్వర్లు, జావీద్, నజీర్ భాయ్ పాల్గొన్నారు.

సుందరయ్య గ్రంథాలయం ప్రాంతంలో 25వ డివిజన్ బుజబుజ నెల్లూరు మిట్టమీద సుందరయ్య గ్రంథాలయం వద్ద సీతారాం ఏచూరికి చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో డివిజన్ శాఖ కార్యదర్శి కష్ణమూర్తి,కొండా ప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో అచ్చి తిరుపాలు, కొండ రవి, కొండయ్య, ఎం. హరిబాబు, సుమంత్, ఎస్.కె మస్తాన్, ఎస్.కె నజీర్, హష్మి, మస్తానయ్య, తదితరులు పాల్గొని నివాళు లర్పించారు.

ప్రజాశక్తి-నెల్లూరురూరల్‌లో

సిపిఎం మూలస్తంభం, నేటి జాతీయ రాజకీయాలలో కీలక పాత్ర వహిస్తున్న ఏచూరి మృతికి సంతాపంగా నెల్లూరు రూరల్ మండలం, కొత్త ఎల్లంటి, పాత ఎల్లంటి గ్రామాల సిపిఎం శాఖల ఆధ్వర్యంలో శుక్రవారం పాత ఎల్లంటిలో సమావేశం జరిగిందికార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పూడిపర్తి జనార్ధన్, మాజీ సర్పంచ్‌లు పి.సుబ్రహ్మణ్యం, వనం రామచంద్రయ్య, పాదర్తి మస్తానయ్య, నారాయణ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-మనుబోలు

మనుబోలు మండల కేంద్రంలోని సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు కటికాల వెంకటేశ్వర్లు, మండల సిపిఎం నాయకులు తలారి దేవదానం, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు, బీసీ భాస్కర్, రైతు సంఘం నాయకులు మాస్ వెంకటేశ్వర్లు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు పమజుల నరసయ్య, జోగి ఆదిశేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

జెఎస్ ట్రస్టులో

స్థానిక జెఎస్ ట్రస్టులో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. కార్యక్రమంలో బోగేశ్వరరావు, జయరామిరెడ్డి, నరసింహారెడ్డి, నగేష్, మాధవయ్య, కరుణానిధి, తదితరులు పాల్గొన్నారు.

జెవివి ఆధ్వర్యంలో

జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యాన మార్క్సిస్టు మేధావి, కమ్యూనిస్టు యోధులు సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి సంతాప సభ కార్యక్రమం నెల్లూరు జెట్టీ శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో జరిగింది.తెలుగు రాష్ట్రం నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయి వరకు కార్మిక కర్షక ప్రజాపక్షాన పోరాటం జరిపిన యోధుడికి నివాళి అంటే తన ఆశయసాధనను కొనసాగించడమే నిజమైన నివాళి అని డాక్టర్ కె.శీను నాయక్, డాక్టర్ ఎండి రఫీలు పేర్కొన్నారు.కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఉదయ్ భాస్కర్, కృష్ణారెడ్డి, ఎం.వి.చలపతి, విద్యాచరణ్, ఐలు నాయకులు అంకయ్య, రమేష్, మాదాల రాము, కృష్ణ, విద్యాధర్, పి.పి.సి కిషోర్, జానకిరామయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

సిపిఎం జాతీయ కార్యదర్శి ఏచూరి సీతారాం ఒక విప్లవ కెరటం అని సిఐటియు జిల్లా అధ్యక్షులు టివి.వి ప్రసాద్ పేర్కొన్నారు. సీతారాం మృతిని పురస్కరించుకొని మండలంలోని నరుకూరులో శుక్రవారం రాత్రి ఘన నివాళి అర్పించారు. సిఐటీయు మండల కార్యదర్శి మారుబోయిన రాజా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రసాద్ పాల్గొన్నారు. సీతారాం ఏచూరి చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ సుబ్బారావు, నక్కా సూరిబాబు, దయాసాగర్, నాశిన పరశురామయ్య, ఏ.గోపీ, శివ, గణేష్, వెంకటశేషయ్య, నక్కా మనోహర్, ఆకుల రఘు, పచ్చా చిన్నారావు, వెంకట శేషయ్య, జయమ్మ, తులసమ్మ తదితరుల పాల్గొన్నారు.

ప్రజాశక్తి–గుడ్లూరు

సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి దేశ ప్రజలకు, కార్మిక కర్షక నిరుపేదలకు తీవ్ర నష్టమని ఆ పార్టీ మండల కమిటీ కన్వీనర్ జి. వెంకటేశ్వర్లు సంతాప సభలో అన్నారు. శుక్రవారం గుడ్లూరు హైస్కూల్ ఆవరణలో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జి స్టాలిన్, నాయకులు, దామా కృష్ణయ్య, కొమరగిరి అంజయ్య, ఎం వెంకటేశ్వర్లు, ఎస్.కె ఖాదర్‌బాషా, నాగేశ్వరరావు, సుంకర విజయలక్ష్మి, జంగాల గోపాల్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కందుకూరు

సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సిపిఎం కార్యాలయంలో సీతారాం ఏచూరికి సంతాపం తెలియజేస్తూ డి రామ్మూర్తి అధ్యక్షతన సభ జరిగింది. ముందుగా సీతారాం ఏచూరి చిత్రపటానికి డి రామ్మూర్తి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సభలో రిటైర్డ్ ఉద్యోగులు డిసిహెచ్ మాలకొండయ్య, బి. వెంకటేశ్వర్లు ,న్యాయవాది పి కోటయ్య సీతారాం ఏచూరి గురించి మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం మాజీ కౌన్సిలర్ నాదెండ్ల కోటేశ్వరావు, ఎస్.కె మున్వర్ సుల్తానా, ఎస్‌కె మల్లిక, ఎం. పద్మ, టి వెంకట్రావు, ఎస్ పవన్, డిఎం రాయుడు, , సల్మా, ఎం ప్రసాద్, ఎం. రవి పాల్గొన్నారు.

ఈపిఎస్ స్కీం పెన్షన్ మంజూరు చేయాలి

-ఆర్‌టిసి ఆఫీస్ కార్యాలయం ఎదుట రిటైర్డ్ ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి-నెల్లూరు : ఆర్‌టిసి సంస్థలో పనిచేసి రిటైర్డ్ అయిన ఉద్యోగులందరికీ ఈపిఎస్ -95 స్కీం పెన్షన్ అందజేయాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం 9548-2000 జిల్లా కార్యదర్శి ఎ.ఆర్ రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం నగరంలోని ఆర్‌టిసి రీజనల్ మేనేజర్ కార్యాలయం ఎదుట రిటైర్డ్ ఉద్యోగులు ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థలో 30 సంవత్సరాలు పనిచేసి రిటైర్డ్ అయిన 300 మంది ఉద్యోగులకు ఈపిఎస్ -95 స్కీం పెన్షన్ వీరందరికి అందజేసేందుకు మేనేజ్‌మెంట్ చర్యలు తీసుకోవాలన్నారు. ధర్నా కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జి.చంద్రమౌళి మాట్లాడుతూ ఈపిఎస్ -95 స్కీం ద్వారా ఆర్‌టిసి రిటైర్డ్ ఉద్యోగులకు మినిమం పెన్షన్ రూ.9 వేలు, కరువు భత్యం అందజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పెన్షనర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు జి.శంకరయ్య మాట్లాడుతూ గతంలో సురేంద్రబాబు ఎండిగా పనిచేస్తున్న సమయంలో సంస్థలో పనిచేస్తూ రిటైర్డ్ అయిన తరువాత నెలలో పెన్షన్ తీసుకున్నారని, ప్రస్తుతం అయిన వారికి కూడా పెన్షన్ మంజూరు కావడం లేదన్నారు. రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి వి.వి నరసింహారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులకు పెన్షన్లు అందజేస్తున్న పథకాన్ని అయినా తమకు అమలు చేయాలని కోరారు. విధి నిర్వహణలో ఉద్యోగి మృతి చెందిన సమయంలో వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. 2019 నుంచి రిటైర్డ్ అయిన ఉద్యోగులకు సంస్థ అందజేయాల్సిన రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందజేయాలన్నారు. టి.రామసుబ్బయ్య, పివిజి నాయుడు, మురళి, వి.సుగుణమ్మ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రంలో పరిశీలన

ప్రజాశక్తి-సంగం : ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖాధికారి ఖాదర్ వలీ ఆకస్మికంగా సందర్శించారు. స్థానిక పిహెచ్‌సి ఆవరణలోని ఫార్మసీ విభాగాన్ని, వ్యాక్సిన్ నిల్వ కేంద్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. స్థానిక ఫార్మసీ ఆఫీసర్ ప్రదీప్‌కుమార్ నుండి వ్యాక్సిన్ నిల్వలను, మెడిసిన్‌కు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకొని, మండల పరిధిలో టిబి రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. అడల్ట్ బిసిజి వ్యాక్సినేషన్ పురోగతి గురించి స్థానిక వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన చర్యల గురించి సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి డాక్టర్ డి.అశోక్ పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-కోవూరు : తమ బ్యాంక్ ఖాతాదారులకు ఆర్థిక లావాదేవీలే కాకుండా వారికి మెరుగైన కంటి చూపు ఉండాలన్న ఆలోచనతో కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశామని ఎపిజివి రీజనల్ మేనేజర్ మోహన్‌రెడ్డి అన్నారు. కోవూరు ఎపిజివి ఆవరణలో శుక్రవారం వాసన్ ఐ కేర్ వారి ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే పలు బ్రాంచ్‌లలో శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. ఉచిత వైద్య శిబిరం విజయవంతం అయ్యేందుకు కృషి చేసిన మేనేజర్ డి.విజయకుమార్‌ను ఆయన సిబ్బందిని అభినందించారు.

వరద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి-కావలి : బిసి సంఘాలు, జంగం దేవర ఆధ్వర్యంలో కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి సూచనల మేరకు విజయవాడ వరద బాధితులకు దుప్పట్లు, నిత్యావసర సరుకులు బిసి సంఘాలు, జంగందేవర నేతలు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న కావలి మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి సూచనల మేరకు కావలి నుండి వచ్చి వరద బాధితులకు దుప్పట్లు, నిత్యావసరాలు పంపిణీ చేసిన నేతలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఎస్‌సి ఐక్య వేదిక జిల్లా విజిలెన్స్ మానిటర్ మెంబర్, ప్రముఖ న్యాయవాది మాలకొండయ్య, బిసి ఐక్యత వేదిక రాష్ట్ర అధ్యక్షులు అడ్డంకి ప్రభాకర్ మాట్లాడుతూ బిసి ఐక్యత భవన్ ప్రధాన కార్యదర్శి చిన్నివరప్రసాద్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో జంగం దేవర వ్యవస్థాపక అధ్యక్షుడు గౌరీశంకర్, గౌరవ అధ్యక్షుడు చంద్రమౌళి, అధ్యక్షుడు ఏ నారాయణ, సెక్రెటరీ గిరి, ఉపాధ్యక్షుడు పి మల్లికార్జున్, మహేష్ రావు, యలమందరావు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు 'సంయుక్త' సేవలు

ప్రజాశక్తి-కావలి : దాతల సహకారంతో శుక్రవారం సంయుక్త సేవాసంస్థ వరదల వల్ల ఎంతో నష్టపోయిన వరద బాధితులకు దాతల సహకారంతో మూడవ సారి విజయవాడలోని కండ్రిగ, తరిగొపుల దగ్గర తెన్నేరు ప్రాంత వరద బాధితులకు సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో 400 దుప్పట్లు, 5 బస్తాల వాటర్ ప్యాకెట్లు, 300 ప్యాకెట్లు కందిపప్పు, 15 బియ్యం బస్తాలు, 36 ఒవల్,24 సిల్వర్ వాటర్ బాటిల్స్, 50 బ్రెడ్ ప్యాకెట్స్,10 చీరలు, 100 పాలప్యాకెట్లు, 20షర్ట్స్, 20ప్యాంట్స్, 20గౌన్లు, 30 డ్రెస్ ట్యాప్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కానిస్టేబుల్ షేక్.మునసోబులు, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర, నిర్మల, షేక్ మహబూబ్ బాషా, జానీ బేగం, రిజ్వాన, ముప్పల.కళ్యాణ్ పాల్గొని వరద బాధితులకు సేవలందించారు. ఈ సందర్భంగా సంయుక్త సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడుతూ సహాయం అందజేసిన దాతలు పాదర్తి నాగరాజుకి, వారిమిత్రులందరికి, కిరాణా మర్చంట్ అసోసియేషన్ సభ్యులకు, వాసవి క్లబ్ లెజెండ్ సభ్యులకు, వాసవి క్లబ్ సెవెన్ హిల్స్ సభ్యులకు, ఆర్యూం.రామమూర్తి, జ్యోతి, సుజాత, కళ్యాణ్, సీతాలక్ష్మి, డాక్టర్ డి.కిశోర్, చంద్రశేఖర్, రాజ్యలక్ష్మి శిల్పి యజమాని యిలింద్ర. రంతుబాబు, అశోకబాబు, రాధాకృష్ణ, శారద బాలిరాజు, వెంకట కళ్యాణ్ వక్కరాజు రాజా, డాక్టర్ రఘువేంద్ర రాజు, సోషల్ మీడియా మిత్రులకు ధన్యవాదాలు తెలియజేశారు.

17 నుంచి స్వచ్ఛతహి సేవా కార్యక్రమం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : 17 నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహించనున్న స్వచ్ఛతహీ సేవ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎంపిడిఒ ఐజాక్ ప్రవీణ్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయంలో వారికి స్వచ్ఛతహి సేవ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 17వ తేదీన అన్ని గ్రామాల్లో ర్యాలీలు, మానవహారం ఏర్పాటు చేయాలని, 18న మొక్కలు నాటే కార్యక్రమం, 19న పరిసరాల పరిశుభ్రతపై అవగాహన, 20వ తేదీ పాఠశాల విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన, 21వ తేదీ సంపూర్ణ స్వచ్ఛతపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, 22న సామాజిక మరుగుదొడ్ల ద్వారా ప్రచారం, 25న పారిశుధ్య కార్మికులకు సంబంధించిన వివిధ సంక్షేమ కార్యక్రమాలు వారికి అందుబాటులో ఉన్నది లేనిది పరిశీలించి రావాల్సిన వారికి పథకాలు అందించేలా అధికారులు చర్యలు, 30వ తేదీ హోటళ్ళు, ఇతర ఆహార పదార్థాలు తయారు చేసే షాపుల వారికి వారి పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకునే విధంగా అవగాహన కల్పించడం, అక్టోబర్ 2వ తేదీ గాంధీ జయంతి సందర్భంగా సంపూర్ణ స్వచ్ఛత కార్యక్రమం ముగింపు ఉత్సవాలు నిర్వహించి పారిశుధ్య కార్మికులను సత్కరించడం, కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్న వారిని గుర్తించి సన్మానించే కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రజాప్రతినిధులు, ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, ఉపాధ్యాయులు, విద్యార్థులను భాగస్వాములు చేయాలన్నారు.

పోషకాహార మహోత్సవం


ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం విశ్వనాధరావుపేట పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం పోషక ఆహార మహోత్సవ కార్యక్రమం సర్పంచ్ గుండాల మంజుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిడిపిఒ సౌజన్య పాల్గొని గర్భిణులు బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు పోషక ఆహారాల గురించి వివరించారు. కార్యక్రమంలో విశ్వనాధరావుపేట పంచాయతీ ఉపసర్పంచ్ కోటేశ్వర్, నిర్మల, ఆదిలక్ష్మి, రమాదేవి, విజయ, ఎం, ఎస్.కె, లు, ఎం ఎల్ హెచ్ ఏ లు, ఏ ఎన్ ఎం లు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు, బాలింతలు, గర్భిణులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కావలి : విద్యుత్ ప్రమాదాల నివారణ చర్యలకు సంబంధించిన పోస్టర్‌ను ఎంఎల్‌ఎ కావ్య క్రిష్ణారెడ్డి విద్యుత్ అధికారులతో కలిసి శుక్రవారం ఆవిష్కరించారు. కావలి డివిజన్‌లో జరిగిన ప్రమాదాల్లో ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా నివారించడంలో కావలి డివిజన్ అధికారుల పనితీరును, ప్రశంసాపత్రాలు, ట్రోఫీలను అధికారులకు ఎంఎల్‌ఎ అందజేశారు. లో-ఓల్టేజ్ సమస్య రాకుండా చూడాలని, ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని ఆదేశించారు.

'ఆదిత్య' విద్యాసంస్థల సహాయం

ప్రజాశక్తి-నెల్లూరు



విజయవాడ వరద బాధితుల సహాయార్థం వారిని ఆదుకునే దానికి ఆదిత్య విద్యాసంస్థల తరఫున వారికి బియ్యం, పప్పులు, నూనె, దుస్తులు ఇతర నిత్యావసర సామాగ్రిని ఎన్.ఎస్.ఎస్ ఆధ్వర్యంలో విక్రమ సింహపురి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ విజయభాస్కర రావుకు అందజేశారు. కార్యక్రమంలో విక్రమ సింహపురి యూనివర్సిటీ రిజిస్ట్రార్ సునీత, ఎన్.ఎస్.ఎస్ కోఆర్డినేటర్ ఉదయ శంకర్, సుబ్బారెడ్డి, ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి.పుల్లయ్య, సిఐఒ శ్రీనివాసరావు, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ అంకయ్య, వర్మ, శివ, యశ్వంత్ సాయి, స్వాతి, విద్యార్థులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళులు



బుచ్చిలో...

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

పట్టణంలో సిపిఎం కార్యాలయంలో శుక్రవారం సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి సీనియర్ నాయకులు జానకి రామయ్య ఆధ్వర్యంలో నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు పుత్తేటి మల్లికార్జున మాట్లాడుతూ కమ్యూనిస్టు కార్యకర్తగా మొదలైన ఆయన జీవితం 50 సంవత్సరాలలో మూడుసార్లు సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారని తెలిపారు. ఎన్నోసార్లు ప్రజా పోరాటాలను, ఉద్యమాలను ఆయన నిర్వహించారు. అనంతరం పట్టణ కార్యదర్శి పోతంశెట్టి శ్రీనివాసులు మాట్లాడుతూ సీతారాం ఏచూరి 10వ తరగతి వరకు హైదరాబాదులో విద్యాభ్యాసం అవ్వగా తన కుటుంబం ఢిల్లీకి పోయారని తెలిపారు. జవహర్లాల్ నెహ్రూ యూనివర్సిటీలో పీజీ పూర్తి చేసి ఢిల్లీ యూనివర్సిటీలో మూడుసార్లు ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడిగా ఎన్నిక కాగా, ఎస్ఎఫ్ఐ పునాదికి కీలక పాత్ర వహించారన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి చల్లకొలుసు మల్లికార్జున, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి నన్నం మాధవయ్య, మండల కమిటీ సభ్యులు ఆర్ అంకయ్య, యు.మునిస్వామి, ఎస్‌కె.జానీ బాషా, ఎస్‌కె మునీర్, ప్రజానాట్య మండలి కళాకారులు చలంచర్ల వెంకటరత్నయ్య, జాలాడి కన్నయ్య, పలువురు సిపిఎం కార్యకర్తలు పాల్గొన్నారు.



బిట్రగుంటలో..

ప్రజాశక్తి-బిట్రగుంట : సీతారాం ఏచూరి మృతి సిపిఎం పార్టీకి తీరని లోటు అని బోగోలు సిపిఎం కార్యదర్శి తుమ్మల వెంకయ్య పేర్కొన్నారు. సీతారాం ఏచూరి మృతికి సంతాప సభను బోగోలు మండలం సిపిఎం కార్యాలయంలో శుక్రవారం మండల సిపిఎం పార్టీ నేతలు, కాంగ్రెస్ పార్టీ నేతలు సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల సిఐటియు కార్యదర్శి చర్ల నరహరి, సిఐటియు సభ్యులు బాదుల్లా, సీనియర్ నాయకులు పొట్లూరి శ్రీనివాసులు, దమ్ము శంకరయ్య, యానాదయ్య, కామారం బుజ్జమ్మ,యువజన సంఘం నాయకులు బ్రహ్మయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఇందుకూరుపేట : సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు అని ఇందుకూరుపేట సీనియర్ నాయకులు గూడూరు ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. కమ్యూనిస్టు ఉద్యమకారుడు ఏచూరి సీతారాం మృతిపై ఆయన సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల పక్షపాతి ప్రజా సమస్యలపై పోరాడే గొప్ప ఉద్యమకారుడు ఏచూరి సీతారాం అని అన్నారు. విద్యార్థి నాయకుడిగా మొదలైన ఆయన ప్రస్థానం ఎంతోమందికి ఆయన ఆదర్శంగా ఎదిగారన్నారు. ఏచూరి మృతి దేశానికే తీరని లోటుగా ఆయన అభివర్ణించారు. అలాంటి నాయకుడిని కోల్పోవడం బాధాకరమన్నారు.



ఆత్మకూరులో...

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి గురువారం ఢిల్లీలోని ఎయిమ్స్‌లో తుది శ్వాస విడిచారు. ఈ మేరకు శుక్రవారం ఆత్మకూరు పట్టణంలోని చెర్లో రమణారెడ్డి భవన్‌లో నాయకులు సిపిఎం పట్టణ శాఖ ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించారు. సీతారాం ఏచూరి మృతి పార్టీకి తీరని లోటు అని పట్టణ కార్యదర్శి డేవిడ్ రాజు, జిల్లా కమిటీ సభ్యులు గంటా లక్ష్మీపతి, సిఐటియు జిల్లా నాయకులు జివి శివప్రసాద్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సంధాని మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కొండమూరి హజరత్తయ్య, ఆవాజ్ జిల్లా నాయకులు యస్దాని, సిపిఎం నాయకులు ఎం.నాగేంద్ర, యుటిఎఫ్ నాయకులు గంగాధర్, తదితరులున్నారు.



ఉదయగిరిలో..

ప్రజాశక్తి-ఉదయగిరి : పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో సిపిఎం, రైతు సంఘ నాయకులు ఆధ్వర్యంలో శుక్రవారం సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రైతు సంఘ నాయకులు కాకు వెంకటయ్య, జెవివి నాయకులు దస్తగిరి అహ్మద్ మాట్లాడుతూ సీతారాం ఏచూరి మరణం దేశ రాజకీయాలకు తీరని లోటని అన్నారు. ఆయన యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు గడ్డం నాగేశ్వరరావు, సిపిఎం మండల కమిటీ సభ్యులు, వివిధ అనుబంధ సంఘ నాయకులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న ఎస్ఐ ఆదిలక్ష్మి

మట్టి తరలింపుపై ఎస్ఐకు ఫిర్యాదు

ప్రజాశక్తి -వరికుంటపాడు

దుత్తలూరు మండలంలోని ఏరుకొల్లు గ్రామం ప్రభుత్వ భూమిలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తుండంతో ఎస్ఐ ఆదిలక్ష్మికి ఆ గ్రామ విఆర్ఒ ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అనుదుకున్న ఎస్ఐ తన సిబ్బందితో మెరుపు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఒక జెసిబి, మూడు టిప్పర్లను అదులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ భూమిలో మట్టిని ఎవరైనా అక్రమంగా తరలిస్తే కఠినంగా వ్యవహరిస్తామని తప్పు చేస్తే ఎవరిని వదిలే ప్రసక్తి లేదని హెచ్చరించారు.

ఎస్ఐ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్



ఎస్ఐ శ్రీనివాసులరెడ్డి

ఆత్మకూరు పోలీస్ స్టేషన్ ఎస్ఐ-2గా కె.శ్రీనివాసులరెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆత్మకూరు, మర్రిపాడు ప్రాంతాలలో ఎఎస్ఐగా విధులు నిర్వహించిన శ్రీనివాసులరెడ్డి ఉద్యోగోన్నతిపై ఆత్మకూరు ఎస్ఐగా చేరారు. ఈ సందర్భంగా ఎస్ఐ జిలాని మర్యాదపూర్వకంగా కలిశారు.

'విశ్వోత్సవ్ 2024' వేడుకలు ప్రారంభం

ప్రజాశక్తి-కావలి



స్థానిక విట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం స్వర్ణోత్సవ సంవత్సరం సందర్భంగా "విశ్వోత్సవ్ 2024" వేడుకల్లో భాగంగా "స్పోర్ట్స్ ఫెస్ట్" కార్యక్రమాన్ని ఆర్‌డిఒ వి.కె.శీనా నాయక్ ప్రారంభించారు. కార్యక్రమంలో విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్ రెడ్డి, విట్స్ కళాశాల చైర్మన్ దొడ్ల విద్యాధర్ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ దొడ్ల ప్రత్యూషా రెడ్డి, అకడమిక్ ఇన్‌ఛార్జి లిఖిత్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శేషయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ స్పోర్ట్స్ ఫెస్ట్‌లో రాష్ట్రంలోని వివిధ ఇంజినీరింగ్ కళాశాలల క్రీడాకారులు బాల, బాలికలు వివిధ క్రీడలైన బాస్కెట్ బాల్, వాలీబాల్, షటిల్ కాక్, త్రో బాల్, చెస్‌లలో పాల్గొన్నారు. ఈ స్పోర్ట్స్ ఫెస్ట్‌ను ఫిజికల్ డైరెక్టర్లు ఆర్.మాల్యాద్రి, పి. ప్రసాద్ రెడ్డి, జోసెఫ్ సుకుమార్, పి.భాస్కర్, ఏడుకొండలు, పవన్, శ్రీకాంత్, భాస్కర్, జగన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎఒ రామకృష్ణ, వైస్ ప్రిన్సిపల్ శ్రీనాథ్ రెడ్డి, కె.వి. సుబ్బయ్య, వి.వి. సునీల్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్యక్రమాలపై సమీక్ష



ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఎంపిడిఒ వెంకటసుబ్బారావు ఆధ్వర్యంలో స్వచ్ఛతహ సేవ, పారిశుధ్య కార్యక్రమాల గురించి సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ వెంకట సుబ్బారావు మాట్లాడుతూ సెప్టెంబర్ 17వ తేదీ నుంచి అక్టోబర్ 2 వరకు జరిగే రోజువారు కార్యక్రమాల గురించి పంచాయతీ కార్యదర్శులకు వివరించామన్నారు. అన్ని గ్రామ పంచాయతీలు పెద్దఎత్తున పారిశుధ్య పనులు చేపట్టవలసిందిగా ఆదేశించామని, మురికి కాలువలు పూడిక తీయడం చెత్త కుప్పలు తొలగించడం ప్రజలకు పారిశుధ్యం గురించి అవగాహన కల్పించడం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించడం మొదలగు కార్యక్రమాలు చేపట్టవలసిందిగా కోరామన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి విస్తరణ అధికారి జహీర్‌బాషా మాట్లాడుతూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని కూడా చేపట్టాలని కోరామని, స్థానిక ప్రజాప్రధనలో భాగస్వామ్యంతో సదర పనులను కూడా పూర్తి చేయాలని కోరామన్నారు. సమావేశంలో కార్యదర్శి ప్రసన్న, పంచాయతీ కార్యదర్శులు, విస్తరణ అధికారి జహీర్‌భాషా, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఎంఎల్ఎ కాకర్ల సురేష్

ప్రజాశక్తి-జలదంకి : జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంఎల్ఎ కాకర్ల సురేష్ తెలియజేశారు. మండలంలోని కమ్మవారిపాలెం గ్రామంలో శుక్రవారం గ్రామ నాయకులు అప్పలనాయుడు ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. జలదంకి జర్నలిస్టులతో సమావేశం ఏర్పాటు చేశారు. జర్నలిస్టుల సమస్యలు అక్రిడేషన్ విషయంలో ఇంటి స్థలాలు, ఆరోగ్య భద్రత, పిల్లల చదువులు ఏ సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తానని జర్నలిస్టుల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పులిగుంట మధుమోహన్ రెడ్డి, ఉదయగిరి నియోజకవర్గ రైతు అధ్యక్షులు పూనూరు భాస్కర్ రెడ్డి, జర్నలిస్టులు కంచర్ల విశ్వేశ్వర నాయుడు, నేలపాటి మాలకొండయ్య, రవీంద్ర, దగ్గు మాటి శ్రీకాంత్ రెడ్డి, వివి రమణయ్య, మధు కిషోర్, వేణు గోపాల్, పాజర్ల సురేష్ బాబు, శ్రీనివాసులు, అరవింద్, పాజర్ల నాగరాజు, శ్రీకాంత్, శ్రీహరి రెడ్డి, పాల్గొన్నారు.

నేడు ఉపాధ్యాయులకు జిల్లాస్థాయి క్రీడా పోటీలు

ప్రజాశక్తి-నెల్లూరు : యుటిఎఫ్ స్వర్ణోత్సవాలను పురస్కరించుకొని శనివారం ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులకు జిల్లా స్థాయి క్రీడా పోటీలను ఎసి సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎన్.నవకోటేశ్వరరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వివి శేషులు, జివి చలపతి శర్మ, అసోసియేట్ అధ్యక్షులు ఎం.సి అచ్చయ్యలు శుక్రవారం ప్రకటనలో తెలియజేశారు. ఈ క్రీడా పోటీలల్లో పాల్గొనే ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు ఉదయం 8.30 గంటలకు స్టేడియం వద్దకు చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు మండల నాయకులు కార్యకర్తలు ఉపాధ్యాయులు అందరూ హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు.

అనారోగ్యంతో రిటైర్డ్ విఆర్ఒ మృతి

ప్రజాశక్తి-మర్రిపాడు



మండలంలోని కొత్త అల్లంపాడు గ్రామానికి చెందిన మాజీ గ్రామ రెవెన్యూ అధికారి పట్టపురాతి వెంకటేశ్వర్లు (70) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందారు. ఆయన రెవెన్యూ శాఖలో 30యేళ్ల విఆర్ఒగా విధులు నిర్వహించి రైతులకు అండగా నిలిచారు. పోస్ట్ మాస్టర్‌గా కుడా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించారు. ఆయన మృతిపై స్థానిక గ్రామస్థులు, మండల ప్రజలు దిగ్భ్రాంతి చెందారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ప్రజల సౌకర్యార్థం ఆర్‌టిసి బస్ సర్వీస్

- సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి ఎంఎల్ఏ ప్రశాంతిరెడ్డి నివాళులు

ప్రజాశక్తి-కోవూరు



బస్ సర్వీస్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్ఏ ప్రశాంతిరెడ్డి

యల్లాయపాలెం పంచాయతీ ప్రజల సౌకర్యార్థం నూతన ఆర్‌టిసి బస్ సర్వీస్‌ను ప్రారంభిస్తున్నట్లు, దానిని సద్వినియోగం చేసుకోవాలని కోవూరు నియోజకవర్గ ఎంఎల్ఏ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. శుక్రవారం కొడవలూరు మండలం యల్లాయపాలెం గ్రామస్తుల సదుపాయార్థం నూతన బస్సు సర్వీస్‌ను ఆమె ప్రారంభించారు. ముందుగా గ్రామానికి వచ్చిన ఎంఎల్ఏ ప్రశాంతిరెడ్డికి గ్రామస్థులు, నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం యల్లాయపాలెం నుంచి నెల్లూరుకు నూతన బస్సు సర్వీసును రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ ఎంఎల్ఏ తన గెలుపులో కీలకపాత్ర పోషించిన యల్లాయపాళెం గ్రామవాసులను కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. గత తొమ్మిదేళ్లుగా యల్లాయపాళెం గ్రామం నుంచి ఆర్‌టిసి బస్సు సౌకర్యం లేదన్న విషయం తనదృష్టికి వచ్చిందన్నారు. దాంతో గ్రామస్థులు ముఖ్యంగా విద్యార్థులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. ఆటోల్లో ప్రయాణం చేయాల్సిన దుస్థితి వచ్చిందని తెలిపారు. ఈ సమస్యలకు పరిష్కారంగా ప్రజల సౌకర్యార్థం నూతన బస్సు సర్వీసును ప్రారంభించినట్లు వివరించారు. 14వ తేదీ శనివారం నిరుద్యోగ యువత కోసం ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సహకారంతో కనుపర్తిపాడులోని విపిఆర్ కన్వెన్షన్‌లో జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. ఈ జాబ్‌మేళాలో కోవూరు నియోజకవర్గ యువతకే తొలి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించే పింక్ బస్ త్వరలోనే కొడవలూరు మండలానికి వస్తుందని, మహిళలు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. నాయకులు విభేదాలు వీడి గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు. రాజకీయాలు ఎన్నికల వరకే అని, ప్రస్తుతం నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కేతు వెంకటరమణారెడ్డి, ఏకొళ్ల వంశీధర్ రెడ్డి, గరికిపాటి రాజేంద్ర, బొడుగు శ్రీనివాసులు, భూలోకం విజయ్‌కుమార్, మదన్ మోహన్, మాల్యాద్రి, రామిరెడ్డి, తదితర నాయకులు పాల్గొన్నారు.

గురుపూజోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-మర్రిపాడు



మండల స్థాయి గురుపూజోత్సవాన్ని స్థానిక ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న రంగనాయకులు, ఉమామహేశ్వర రావులను, మండల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికైన ఒ.రాధాకృష్ణమూర్తి, వై.శ్రీనివాసులు, షేక్.షాహిన్ బేగం, బి.రాధాకృష్ణయ్య, ఎన్.రాజేశ్వరి, ఎన్.వెంకటేశ్వర్లు, కే.మరియమ్మ, ఐ.భాస్కర్ షేక్.షాజహాన్, పి.వెంకటేశ్వర్లు, పఠాన్ ఖాసీం రజ్వి, ఐ.వెంకటేశ్వర రెడ్డి, పి.శ్రీనివాసులను మండల విద్యాశాఖ, సాహో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎంఇఒ-1జ్యోతి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదమైన వృత్తి అని, మంచి సమాజాన్ని నిర్మించడం ఉపాధ్యాయుడి వల్ల మాత్రమే సాధ్యం అవుతుందన్నారు. సాహో ఫౌండేషన్ వ్యవస్థాపకులు పడచల నాగేశ్వరరావు మాట్లాడుతూ తల్లిదండ్రులు జన్మనిస్తే విద్యార్థికి జీవితాన్ని ఇచ్చేది ఉపాధ్యాయుడని, అన్ని వృత్తుల్లోకెల్లా ఉపాధ్యాయ వృత్తి గొప్పదన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యా అవార్డు గ్రహీతలు మండలంలోని ఉపాధ్యాయులందరికీ విందు భోజనాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 ధనలక్ష్మి, మర్రిపాడు సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ శ్రీనివాసులు, మర్రిపాడు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మలత, మర్రిపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ హనుమంత రాజు, విశ్రాంత మండల విద్యాశాఖాధికారి జొన్నా సత్యనారాయణ, సాహో ఫౌండేషన్ సభ్యులు కర్యావుల రమణయ్య, పోలిరెడ్డిపల్లి, కంపసముద్రం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరికృష్ణ, వెంకటేశ్వర్లు, ఎంఆర్‌జి రాజేంద్రకుమార్, మండలంలోని అందరు ఉపాధ్యాయులు, వారి బంధుమిత్రులు, సి.ఎం.ఆర్.టి. ఉపాధ్యాయులు, ఆఫీసు సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలు యథావిధిగా నిర్వహించాలి

ప్రజాశక్తి-ఉదయగిరి : ప్రభుత్వ, ప్రయివేటు యాజమాన్యాలు రెండో శనివారం పాఠశాలలు యథావిధిగా నిర్వహించాలని ఎంఇఒ-2 తోట శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని యాజమాన్యాల ప్రధానోపాధ్యాయులకు, ప్రయివేటు పాఠశాల కరస్పాండెంట్లు శనివారం యథాతథంగా పాఠశాలలను నిర్వహించాలన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు గతంలో తుపాను కారణంగా ఇచ్చిన సెలవు బదులు రెండవ శనివారం పని దినంగా నిర్వహించారన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి, కందుకూరు.

O.S.No.422/2019

దారం హైమావతి
మరియు ఇతరులు - వాదులు

Vs

దారం చిట్టిబాబు
మరియు ఇతరులు - ప్రతివాదులు

To,
D3. **భూపతి రజనీ, భర్త మురళీ మోహన్,** వయస్సు 35 సం॥లు, హిందూ, హౌస్‌వైఫ్, R/o Old Court Building, అమల నాథుని వారి వీధి, బలిజపాలెం, కందుకూరు టౌన్, పాత ప్రకాశం జిల్లా, ప్రస్తుతం ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా.

పైన తెలిపిన పిటిషన్‌లో వాదులు ప్రతివాదులపై దావా దాఖలు చేసివున్నారు. మరియు మీ హాజరు నిమిత్తమై **తేది: 23-09-2024** న కోర్టు వారు వాయిదా వేసివున్నారు. కావున మీరు నేరుగా గానీ, లేదా మీ తరపు న్యాయవాది ద్వారా గానీ వాయిదా **తేది: 23-09-2024** న హాజరై మీ వాదనలు తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున కోర్టు వారు తీర్మానించెదరని తెలియజేయడమైనది.

॥ కోర్టువారి ఉత్తర్వుల మేరకు ॥
వి.సులోచన
వాది తరపు న్యాయవాది, కందుకూరు,
ఫోన్: **8500854195**

17న నులి పురుగుల నివారణ దినోత్సవం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్



17వ తేదీన నిర్వహించనున్న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సాన్ని విజయవంతం చేసేలా వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా అడిషనల్ డిఎంహెచ్ఒ డాక్టర్ షేక్ ఖాదర్ వలీ అన్నారు. శుక్రవారం ఆత్మకూరు అర్బన్ పిహెచ్‌సిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి వైద్యాధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్బెండజోల్ మాత్రలను 17వ తేదీ మధ్యాహ్నం భోజనం అనంతరం ఈ మాత్రలను మింగించాలని, అంతకుముందుగా చేతులను పరిశుభ్రంగా ఉంచుకునేలా చూడాలన్నారు. గుండెజబ్బులు, కిడ్నీ వ్యాధులు, లీవర్ వ్యాధులు, క్యాన్సర్, కామెర్లు, జ్వరం, విరేచనాలు, అలర్జీ సంబంధిత జబ్బులు ఉన్నవారికి ఇవ్వొద్దన్నారు. మున్సిపల్ పరిధిలో 13033 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. అనంతరం క్షయ వ్యాధి గురించి సలహాలు సూచనలు ఇచ్చారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అర్బన్ పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ షేక్ అస్మా, ఎంపిహెచ్ఇఒ సుధాకర్, ఫార్మాసిస్ట్ ఎం.ప్రణీత ప్రియ, ఎల్ టి శ్యాం, డిఇఒ షేక్.ఖాజారంతుల్లా, ల్యాబ్ టెక్నిషియన్ సుధాకర్, టిబి సూపర్‌వైజర్ కె వెంకటేశ్వరరావు ఉన్నారు.

ఎంఎల్ఏను కలిసిన చైర్‌పర్సన్

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం



కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని శుక్రవారం బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ ఆమె భర్త మోర్ల మురళి, కౌన్సిలర్లు రాచూరి సత్యనారాయణ, చీర్ల ప్రసాద్, శివ కుమార్ రెడ్డి ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కొంతకాలంగా అనుకున్నట్లుగానే టిడిపిలో చేరేందుకు ప్రశాంతి రెడ్డిని కలిశారని సమాచారం. త్వరలోనే మండల టిడిపి నాయకుల చొరవతో మరో ముగ్గురు వైసిపి కౌన్సిలర్లు టిడిపి తీర్థం పుచ్చుకోబోతున్నట్లు సమాచారం. బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీని టిడిపికి అనుకూలంగా మార్చేందుకు త్వరలోనే రంగం సిద్ధమైనట్లు సమాచారం.

జీవన్ సాగర్ ఎగ్జిబిషన్ ప్రారంభం

ప్రజాశక్తి-కావలి



ఎగ్జిబిషన్ ప్రారంభిస్తున్న ఎంఎల్ఏ వెంకటక్రిష్ణారెడ్డి

కావలి పట్టణంలో బాపూజీనగర్ పోలీస్ ఫ్యూయల్ స్టేషన్ సమీపంలో పోలీస్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన "జీవన్ సాగర్ ఎగ్జి బిషన్"ను శుక్రవారం ఎం.ఎల్.ఎ. దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎం.ఎల్.ఎ. మాట్లాడుతూ కావలి పట్టణంలో ప్రజల వినోదం కోసం మనల్ని నమ్మి, జీవన్ సాగర్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారని, ఇళ్లలో ఏమీ తోచకపోతే ఇలాంటి ఎగ్జిబిషన్‌ల ద్వారా వినోదం పొందవచ్చన్నారు. ప్రజలు ఆదరించాలని కోరారు. వారి ప్రయత్నం ఫలించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు మోహన్ రావు, గర్రె వెంకటేశ్వర్లు, గర్రె సురేష్, టిడిపి నాయకులు జి.రాజ్ కుమార్ చౌదరి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య, శ్రీకాంత్, తిరువీధి ప్రసాద్, కాకి ప్రసాదరావు, గంగినేని వెంకటేశ్వర్లు నాయుడు, ఆలా శ్రీను, జాగర్లమూడి రామారావు, తదితరులు పాల్గొన్నారు.



మేకపాటి పేరు తొలగింపు

ప్రజాశక్తి-సంగం

సంగం బ్యారేజీ వద్ద మాజీ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి సంగం బ్యారేజీ పేరుతో ఉన్న నేమ్ బోర్డులో బ్యారేజీ అధికారులు మేకపాటి గౌతంరెడ్డి పేరును తొలగించారు. ప్రభుత్వం ఇటీవల రాష్ట్రంలో బ్యారేజీలకు పెట్టిన నాయకుల పేర్లు తొలగించాలని జిఒ విడుదల చేయడంతో అధికారులు చర్యలు చేపట్టారు. బ్యారేజీకి రెండు వైపులా ఉన్న నేమ్ బోర్డులో మేకపాటి గౌతమ్‌రెడ్డి పేరును తొలగించారు. ఇకనుండి సంగం బ్యారేజీగానే కొనసాగుతుందని తెలియజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-వరికుంటపాడు

వరికుంటపాడు పట్టణంలో విద్యుత్ స్థంభాల మార్పు మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎఇ కుద్దుష్ బాషా తెలిపారు. పట్టణంలోని ప్రజలందరూ సహకరించాలని వారు కోరారు.